క్లుప్తంగా

రోడ్లపై తిరిగే పశువులు గోశాలకే

నిర్మల్‌టౌన్: పట్టణంలోని పశువులను యజమానులు రోడ్లపైకి వదలొద్దని మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆవులు, గేదెలు, ఎడ్లు రోడ్లపైకి వచ్చి మొక్కలు తినడం, మల, మూత్రం విసర్జన చేయడంతోపాటు వాహనదారులకు అడ్డుగా వచ్చి ప్రమాదాలకు కారణం అవుతున్నాయని పేర్కొన్నారు. నిబంధనలు పాటించకుంటే యజమానులకు జరిమానాలు విధించడంతోపాటు పశువులను గోశాలకు తరలిస్తామని వివరించారు.

బాధిత కుటుంబానికి సాయం



సాయం అందిస్తున్న కనకాపూర్ వాసులు

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ గ్రామంలో నిర్మల్‌కు చెందిన ఎల్లంత్రవార్ రవి (35) చెప్పుల దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల దుకాణం మూసి ఇంటికి బైక్‌పై వెళ్తూ అడవి పందులు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. అతనికి భార్య నవనీత, అమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కనకాపూర్‌లో షాపుల యజమానులు, అతడి మిత్రులు రూ. 27,500 జమ చేసి శనివారం బాధిత కుటుంబానికి అందించారు. గ్రామస్తులు ముత్తన్న, వెంకటరాజు, రాజేశ్వర్, జనార్ధన్‌ఉన్నారు.

ఓటరు జాబితా పకడ్బందీగా రూపొందించాలి

లోకేశ్వరం: తప్పుల్లేకుండా పకడ్బందీగా ఓటరు జాబితాను రూపొందించాలని మాస్టర్ ట్రెయినీ దేవేందర్.. బీఎల్‌వోలకు సూచించారు. శనివారం మండలకేంద్రంలోని రైతువేదికలో మండలంలోని బీఎల్‌వోలకు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అర్హులను ఓటర్లుగా చేర్చి మరణించిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సర్ఫరాజ్ అహ్మద్, డిప్యూటీ తహసీల్దార్ రవీందర్, ఆర్‌ఐలు లలిత, ప్రమోద్ ఉన్నారు.

డీసీసీ అధ్యక్షుడికి పరామర్శ



శ్రీహరిరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

ఖానాపూర్: అనారోగ్యంతో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావును శనివారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పరామర్శించారు. ఈసందర్భంగా ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఆయన వెంట టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంభూపాల్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

అదనపు కలెక్టర్ తనిఖీ



దరఖాస్తులు పరిశీలిస్తున్న కిశోర్‌కుమార్

మామడ: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిశోర్‌కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూభారతి దరఖాస్తులను పరిశీలించి తహసీల్దార్ శ్రీనివాస్‌రావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల భూ దరఖాస్తులు పరిశీలించి సత్వరం పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు.

17 వాహనాలకు జరిమానా



మాట్లాడుతున్న సీఐ నైలు

భైంసారూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ నైలు సూచించారు. శనివారం మండలంలోని లింగా గ్రామ సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నంబరుప్లేట్లు లేకుండా, మద్యం సేవించి వా హనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నా రు. పత్రాలు సరిగా లేని 17 వాహనాలకు జ రిమానా విధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు శంకర్, సుప్రియ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సుర్జాపూర్‌లో వైద్యశిబిరం

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం పెంబి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అంతకుముందు గర్భిణులు, చిన్నారులకు టీకాలు అందించారు. ఎస్‌యూవో రాజు, ఏఎన్‌ఎంలు యేత్సేనా, రజిత, కార్యదర్శి మల్లేశ్ ఉన్నారు.

వనమహోత్సవంలో భాగస్వాములవ్వాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



చించోలి (బి)లో మొక్కలు నాటుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, సిబ్బంది

సారంగాపూర్: ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించే స్వచ్ఛదనం, పచ్చదనం పెంచేందుకు వనమహోత్సవం కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములవ్వాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శనివారం సారంగాపూర్ మండలం చించోలి(బి) గ్రామంలో వనమహోత్సవం నిర్వహించగా కలెక్టర్, అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ హాజరై మొక్కలు నాటారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వనమహోత్సవంలో మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలన్నారు. అమ్మ పేరిట ఒక మొక్క కార్యక్రమంలో పిల్లలతో మొక్కలు నాటించి ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే సర్టిఫికెట్ జనరేట్ అవుతుందని తెలిపారు. మొక్కలను రక్షించేందుకు కంచెలను ఏర్పాటు చేయించాలని సూచించారు. అనంతరం ఎవెన్యూ ప్లాంటేషన్, గ్రామంలోని డంపింగ్‌యార్డు తదితరాలను పరిశీలించారు. పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ లక్ష్మీకాంత్‌కు సూచించారు.

వ్యాధుల కట్టడికి చర్యలు తీసుకోండి..

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా వైద్యసిబ్బంది అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రై డే తప్పకుండా పాటించేలా ప్ర జలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. డీపీఓ శ్రీనివాస్, ఎంపీఓ అజీజ్‌ఖాన్, ఏపీఓ లక్ష్మారెడ్డి, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

కుంటాల: మన మహోత్సవంలో భాగంగా ఇంటింటా తమ తల్లిదండ్రులతో విద్యార్థులు మొక్కలు నాటించాలని ప్రిన్సి పాల్ తుకారాం పేర్కొన్నారు. శనివారం కుంటాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అధ్యాపకులు డాక్టర్ సు రేశ్, ఉమేశ్, రమ్య, గజేందర్, ముత్యం, చి రంజీవి పాల్గొన్నారు.

కుంటాల: వనమహోత్సవంలో భాగంగా మండల కేంద్రంలో కుంటాల–కల్లూర్ రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటించారు. డీఎల్పీవో సుదర్శన్, ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో ఎంఏ రహీంఖాన్, కార్యదర్శి రాజబాపు, ఎఫ్ఏ రాజేశ్వర్ తదితరులున్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

తానూరు: ప్రతి ఒక్కరూ తమ వంతుగా మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీవో నసీరొద్దీన్ అన్నారు. శనివారం మండలంలోని బెంబర, భోసి, ఎల్వి గ్రామాల్లో వనమహోత్సవం నిర్వహించగా గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేసి నాటించేలా చూడాలని సిబ్బందికి సూచించారు.



బెంబరలో మొక్కలు నాటుతున్న గ్రామస్తులు

కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో శివలింగయ్య, టీఏలు రమణగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

సారంగాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీడీఓ లక్ష్మీకాంత్ రావు ఆధ్వర్యంలో అధికారులు వనమహోత్సవంనిర్వహించారు. ఈసందర్భంగా జామ్, హనుమాన్‌తండా, దుర్గానగర్ తదితర గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా, ప్రభుత్వ అనుమతులు పొందిన వెంచర్లలో మొక్కలు నాటారు. ఎంపీఓ అజీజ్‌ఖాన్, ఉపాధి కూలీలు ఉన్నారు.

దశలవారీగా అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే రామారావు పటేల్



ముధోల్‌లో చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

ముధోల్: నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తి.. దశలవారీగా అభివృద్ధి చేస్తానని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పేర్కొన్నారు. శనివారం మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల బ్రహ్మణ్‌గావ్ లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మతులకు రూ.5కోట్ల 80లక్షల నిధులు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న 28వ ప్యాకేజీ పనులను పునఃప్రారంభం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావుపటేల్, ఆత్మ చైర్మన్ గన్ను నర్సారెడ్డి, తహసీల్దార్ శ్రీలత, నాయబ్ తహసీల్దార్ తెలంగ్‌రావు, ఆర్ఐ నారాయణ్‌రావపటేల్, బీజేపీ మండలాధ్యక్షుడు కోరి పోతన్న, నాయకులు గంట శ్రీనివాస్, విఠల్‌రావు తదితరులున్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ముధోల్: మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను కుభీర్ విఠలేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులను సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కుభీర్‌లో ఆసుపత్రి ఎదుట నిర్మించిన అక్రమ షెడ్లను తొలగించడంతో ఆలయంలో వరద రాకుండా సమస్య తీరిందన్నారు. ఆసుపత్రి ఎదుట సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణానికి రూ.కోటి 45లక్షలు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు డాక్టర్ పెంటాజీ, ఉపాధ్యక్షుడు సూది రాజన్న, కందూర్ సాయినాథ్, సభ్యులు శంకర్, దత్తుసింగ్, వాసు, శ్రీకర్ తదితరులున్నారు.

ఆలయ పునఃనిర్మాణం ప్రారంభించకుంటే దీక్ష చేస్తా

బాసర: బాసర ఆలయ పునఃనిర్మాణ పనులు ప్రారంభించకుంటే వచ్చే దసరా, దీపావళి పండుగల సమయంలో నిరాహార దీక్షకు దిగుతానని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. వెనక్కి వెళ్లిన రూ.42కోట్ల నిధులను తిరిగి తీసుకొచ్చి 2027లో గోదావరి పుష్కరాలు వచ్చే వరకు బాసర ఆలయం పునర్నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో 37 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పవన్ చంద్ర, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్లె ప్రకృతివనం కబ్జా?

- మొక్కలు తొలగించిన ఆక్రమణదారులు
- గ్రామస్తుల ఆందోళనతో రంగంలోకి అధికారులు



బోరిగాం తండాలో పల్లెవనంలో మొక్కలు



తండా వాసులతో మాట్లాడుతున్న ఎంపీడీవో



మొక్కలు తొలగించి చదును చేసిన దృశ్యం

లక్ష్మణచాంద: మండలంలోని బోరిగాం తండా సమీపంలోని ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం కబ్జాకు కొందరు యత్నిస్తున్నారు. ఈ వనంలో మొక్కలు తొలగించి స్థలాన్ని ఆక్రమించేందుకు చదును చేశారు. గతంలో ఈ ప్రాంతంలోని మూడె ఎకరాల ప్రభుత్వ భూమిలో రెండు ఎకరాలను బోరిగాం, బోరిగాం తండా గ్రామస్తులకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించారు. మిగిలిన ఎకరంలో పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేసి మొక్కలు నాటగా ఏపుగా పెరిగాయి.

ఆక్రమణపై గ్రామస్తుల ఆగ్రహం

శుక్రవారం రాత్రి బోరిగాం గ్రామానికి చెందిన గుర్తుతెలియని వ్యక్తులు పల్లె వనంలోని మొక్కలను తొలగించి, స్థలాన్ని చదును చేశారు. శనివారం ఉదయం గమనించిన గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన వ్యక్తం చేశారు. తమ గ్రామానికి కేటాయించిన పల్లె వనంలో మొక్కలు తొలగించి ఆక్రమించేందుకు యత్నించడం సరికాదని హెచ్చరించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అధికారుల హామీ..

ఘటన గమనించిన బోరిగాం తండా వాసులు వెంటనే ట్రాక్టర్ ద్వారా నర్సరీ నుంచి కొత్త మొక్కలు తీసుకొచ్చి పల్లె ప్రకృతివనంలో నాటారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో రాధ, పంచాయతీ కార్యదర్శి రజని సంఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్తులతో చర్చించారు. గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి మొక్కలను తొలగించి స్థలాన్ని చదును చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. గ్రామస్తులు ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శికి తెలుపగా ఆమె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.పల్లె వనంలో మొక్కలను తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ప్రకృతి వనానికి రెవెన్యూ అధికారులు హద్దులు ఏర్పాటు చేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు.

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు

- నిర్మల్ డిపో నుంచి ప్రారంభం

నిర్మల్‌టౌన్: నిర్మల్ ఆర్టీసీ డిపో నుంచి పుణ్యక్షేత్రాలైన కాణిపాకం, అరుణాచలం, పాలని, పాతాళశంబు, మధుర మీనాక్షి, రామేశ్వరం, శ్రీరంగం, భద్రాచలం, అన్నవరం, శ్రీశైలంకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ పండరి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

9న అరుణాచలం..

ఈనెల10న గురుపౌర్ణమి పురస్కరించుకొని అరుణాచలం గిరి ప్రదక్షణ కోసం నిర్మల్ నుంచి 9వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటలకు బస్సు బయలుదేరుతుంది. 10వ తేదీ ఉదయం ఏడు గంటలకు కాణిపాకం చేరుకొని అక్కడి నుంచి వరాహసిద్ధి వినాయక దర్శనం, వెల్లూరు గోల్డెన్ టెంపుల్ అనంతరం సాయంత్రం అరుణాచలం చేరుకుంటుంది. అక్కడ గిరి ప్రదక్షణ ముగించుకొని, మరుసటి రోజు బస్సు బయలుదేరి గద్వాల జిల్లా అలంపూర్ జోగులాంబ అమ్మవారి దర్శనం చేసుకుని నిర్మల్ చేరుకుంటుంది. ఈ బస్సుకు ఒక్కరికి చార్జి రూ. 4900 ఉంటుంది. భోజనం, వసతి ఖర్చుల బాధ్యత ప్రయాణికులదే. మరో బస్సు ఈనెల 16న నిర్మల్ నుంచి బయలుదేరి కాణిపాకం, అరుణాచలం, పాలని పాతాళశంబు, కరంగిల్ మాల, మధుర మీనాక్షి, రామేశ్వరం, శ్రీరంగం దర్శనం చేసుకొని 21వ తేదీ సాయంత్రం నిర్మల్ చేరుకుంటుంది. ఈ బస్సుకు ఒక్కరికి చార్జి రూ.7500 ఉంటుంది. భోజనం, వసతి ఖర్చులు ప్రయాణికులే భరించాలి.

9న శ్రీశైలంకు సైతం..

ఈనెల 9న బుధవారం నిర్మల్ నుంచి రాత్రి 8 గంటలకు బస్సు బయలుదేరి మరుసటి రోజు(గురువారం) ఉదయం శ్రీశైలం చేరుకుంటుంది. అక్కడ దర్శనం అనంతరం అదేరోజు సాయంత్రం శ్రీశైలం నుంచి బస్సు బయలుదేరి శుక్రవారం తెల్లవారుజామున నిర్మల్ చేరుకుంటుంది. చార్జి ఒక్కొక్కరికి రూ.2250 ఉంటుంది. ఈ టికెట్లను మీ మొబైల్‌లో కానీ, బస్‌స్టేషన్‌లో ఉన్న రిజర్వేషన్ కౌంటర్‌లో ముందస్తుగా బుక్ చేసుకోవచ్చని డిపో మేనేజర్ పేర్కొన్నారు.

మోతాదుకు మించి రసాయనాలు వాడొద్దు

- డీఏవో అంజిప్రసాద్



న్యూవెల్మల్‌లో అవగాహన కల్పిస్తున్న అంజిప్రసాద్

సోన్: మోతాదుకు మించి రసాయన ఎరువులను వినియోగిస్తే.. భూమి భూసారం కోల్పోయి పంట దిగుబడులు తగ్గుతాయని జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని న్యూవెల్మల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో రసాయన ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ పంటల సాగుకు ముందు భూ సార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని రైతులకు సూచించారు. ఏవో వినోద్‌కుమార్, ఏఈవో ఉమామహేశ్వరి, గ్రామ ప్రత్యేక అధికారి రాజమల్లు, కార్యదర్శి భూపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గంగన్న, రాజేశ్వర్, వీడీసీ చైర్మన్ జిలకర వేణు, గంగాధర్ పాల్గొన్నారు.

నానో యూరియాతో అధిక దిగుబడులు

కుంటాల: నానో యూరియా వినియోగిస్తే మొక్కకు నత్రజని అంది అధిక పంట దిగుబడులు వస్తాయని భైంసా ఏడీఏ వీణ పేర్కొన్నారు. శనివారం కుంటాలలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం పరిశీలించారు. మండలవ్యాప్తంగా 40 శాతం మాత్రమే ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం నమోదు పూర్తయిందని.. రైతులు ముందుకొచ్చి వివరాలు సమర్పించాలని కోరారు. అనంతరం రైతులతో మాట్లాడారు. ఏవో విక్రమ్, ఏఈవోలు గణేశ్, హర్షిత, చైతన్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శిశుమందిరాలు సంస్కృతికి నిలయాలు

నిర్మల్‌రూరల్: శిశుమందిరాలు సంస్కృతికి నిలయాలని.. వీటిల్లో ప్రవేశాల సంఖ్య పెంచాలని ప్రాంత సంఘటన మంత్రి శ్రీనివాసరావు అన్నారు. శనివారం నిర్మల్‌లోని బాగులవాడ శిశుమందిర్‌లో కార్యశాల నిర్వహించగా ఉమ్మడి జిల్లా శిశుమందిరాలల్లోని నూతన ప్రబంధకారిణి సభ్యులు హాజరయ్యారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడారు. నిర్మల్‌లోనే మొదటి శిశుమందిర్ ఏర్పడి దేశవ్యాప్తంగా విస్తరించిందని పేర్కొన్నారు. వెంకటలక్ష్మి, రావుల సూర్యనారాయణ, దామోదర్, గోపాల్ కిషన్, కూన ప్రవీణ్ కుమార్, సుదర్శన్ పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం చేయాలి

మామడ: కార్మికులంతా ఐక్యంగా ఉంటూ ఈ నెల 9న చేపట్టే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజన్న అన్నారు. శనివారం మండలంలోని న్యూసాంగ్విలో కార్మికులతో కలిసి సమ్మె పోస్టర్ విడుదల చేశారు. అక్బర్, మధుకర్, భూమేశ్, రేణుక, గురుచరణ్, భూమన్న పాల్గొన్నారు.

నిర్మల్‌కు అఖండ రామ్ జ్యోతి

నిర్మల్‌చైన్‌గేట్: లోక కల్యాణం కోసం అఖండ భారతావని సంకల్ప దీక్షతో కన్యాకుమారి నుంచి అయోధ్య వరకు చేపట్టిన అఖండ రామ్ జ్యోతి పాదయాత్ర శుక్రవారం రాత్రి నిర్మల్‌కు చేరింది. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ సభ్యులు వారికి స్వాగతం పలికి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం బోయవాడ హనుమాన్ ఆలయం నుంచి ఆ ధ్యాత్మిక వేత్త లక్కీరామ్ తన ప్రయాణాన్ని పునఃప్రారంభించారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా సభ్యులు ముప్పిడి రవి, గజవాడ క పాల్, హిందూ ధర్మ ప్రచారక్ రాజేందర్, ప్ర భాకర్ పాల్గొన్నారు. అంతకుముందు అయ్యప్ప సేవా సమితి సభ్యులు బద్రి శ్రీనివాస్, ఆనంద్, సాయి, అడప నవీన్ తదితరులు వారికి పండ్లు అందించారు.

బాసర ట్రిపుల్‌ఐటీకి ఎంపిక



జె.రాజేశ్



గంగోత్రి



విఘ్నేశ్వర్



గజానంద్



నిషిత



మస్కాపూర్ పాఠశాలలో విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు



అక్షయ



ఎండీ సనా



షేక్ అయాన్

ముధోల్: బాసర ట్రిపుల్‌ఐటీలో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో 2025–26 విద్యాసంవత్సరంలో ప్రవేశానికి ఎంపికైన విద్యార్థుల జాబితాను శుక్రవారం విడుదల చేశారు. ఈనేపథ్యంలో ముధోల్ మండలంలోని ఆష్టా ఉన్నత పాఠశాలకు చెందిన జె.రాజేశ్, ఎడ్‌బిడ్ ఉన్నత పాఠశాలకు చెందిన సుంక గంగోత్రి బాసర ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యారు. వీరిని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

కుంటాల: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన విఘ్నేశ్వర్, గజానంద్ అనే విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీలో 2025–26 విద్యాసంవత్సరానికి ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు చదివేందుకు ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ కాసు నవీన్‌కుమార్, సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

ఖానాపూర్ మండలం నుంచి 13 మంది..

ఖానాపూర్: ఖానాపూర్ మండలానికి చెందిన 13 మంది విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం నరేందర్‌రావు తెలిపారు. కట్టెకోల శ్రీవల్లి, జూజారే రాజు, సముద్రాల స్నిగ్ధ, మేడిపల్లి ఆదర్శిని, బక్కశెట్టి రోహిత్‌రాజ్, మైలారం హర్షిణి, కొట్టె హర్షవర్ధన్, షేక్ రాహిల్, మైస నందిని ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను శనివారం పాఠశాలలో సన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది, నాయకులు దయానంద్, స్వామి, లక్ష్మణ్, వెంకటేశ్, మహేందర్, శివ, తదితరులున్నారు.

ఇతర పాఠశాలల నుంచి నలుగురు..

పట్టణంలోని బాలికల జెడ్పీహెచ్‌ఎస్ నుంచి నిషిత, అక్షయలు ఎంపికయ్యారని హెచ్‌ఎం సంధ్యారాణి తెలిపారు. సుర్జాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఎండీ సనా ఎంపికైనట్లు హెచ్‌ఎం దురిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి షేక్ అయాన్ ఎంపికైనట్లు హెచ్‌ఎం రాజలింగం తెలిపారు.

సంక్షిప్త వార్తలు

రైతులకు మరిన్ని సేవలు

ముధోల్: రైతులకు అందుబాటులో ఉండి మరిన్ని సేవలందిస్తామని ముధోల్ డివిజన్ ఆత్మ చైర్మన్ గన్ను నర్సారెడ్డి, భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సిందే ఆనంద్‌రావుపటేల్ అన్నారు. శనివారం ముధోల్ ఎంపీడీవో కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు వారిని సన్మానించారు. అనంతరం ఆత్మ చైర్మన్ కార్యాలయం కోసం ఏడీఏ వినయ్‌బాబుతో భవనం సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివకుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రావుల గంగారెడ్డి, నాయకులు ఉన్నారు.

పీరీల సందడి

ఖానాపూర్: ఈనెల 7న మొహర్రం పురస్కరించుకొని పట్టణంలోని శాంతినగర్ కాలనీతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో డప్పుచప్పుళ్ల నడుమ పీరీల ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

నూతన కార్యవర్గం

సర్సాపూర్(జి): మండలకేంద్రంలో శనివారం ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నర్సాపూర్(జి) అధ్యక్షుడిగా గడ్డం దేవేందర్, కోశాధికారిగా తీగల కేశవ్, ప్రచార కార్యదర్శిగా పీరటి మహేశ్, సలహాదారులుగా పీరాజి, ఉమామహేశ్వర్, పాతర్ల గణేశ్, పిట్ల సాయన్న, సతీశ్, యాటకర్ల నవీన్ ఎన్నికయ్యారు.

కాలువలు శుభ్రం చేయించిన రిటైర్డ్ ఎస్సై

కడెం: మండలకేంద్రంలోని ఆరోవార్డులో డ్రెయినేజీలను కడెంకే చెందిన రిటైర్డ్ ఎక్సైజ్ ఎస్సై సీహెచ్.లక్ష్మణ్ సొంత ఖర్చులతో శుభ్రం చేయించారు. ఏటా వర్షాకాలంలో ఇళ్లలోకి వరద వస్తుందని కాలనీవాసులు లక్ష్మణ్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన పొక్లెయిన్ సాయంతో పూడిక తీయించారు.

చిన్నారులను ప్రైవేటు బడులకు పంపించొద్దు

లోకేశ్వరం: రెండు నుంచి నాలుగేళ్ల మధ్య చిన్నారులను ప్రైవేటు పాఠశాలల్లో చేర్చుకుంటే యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు శనివారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సర్ఫరాజ్ అహ్మద్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వెంకటరమేశ్‌కు, ఎమ్మార్సీ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఫర్హాణ, విమల, సురేఖ, సునీత, సుజాత, ప్రభ, పద్మ, నర్సవ్వ, దేవిక, వసంత, లక్ష్మి, అన్నపూర్ణ, పద్మ, పరమేశ్వరి ఉన్నారు.

ఇంటి నిర్మాణాలు ప్రారంభించాలి

లోకేశ్వరం: లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. శనివారం మండలంలోని లక్ష్మీనగర్ తండాలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం అధికారులు ముగ్గు పోశారు. కార్యక్రమంలో ఎంపీవో సోల మాన్‌రాజ్, కార్యదర్శి అశోక్ ఉన్నారు.

సన్మానం

కడెం: మండలంలోని నవబ్‌పేట్‌లోని సత్యం ట్రెడిషనల్ ట్రస్ట్‌కు ఇటీవల రాష్ట్ర స్థాయి అవార్డ్ దక్కగా.. శనివారం పెంబి మాజీ జెడ్పీటీసీ భుక్యాజానుబాయి ట్రస్ట్ చైర్మన్ రాపెల్లి సత్యం సత్కరించారు, రైతు నేత హపవత్ రాజేందర్ తదితరులున్నారు.

కడెం: నూతన ఎస్సై పి.సాయికిరణ్‌ను శనివారం బీఆర్‌ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సైకి పుష్పగుచ్ఛం అందించి శాలు వాతో సన్మానించారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నల్ల జీవన్‌రెడ్డి, రాజేశ్వర్‌గౌడ్, రఫీక్, గంగన్న, జాహేద్, విజయ్, గంగేశ్వర్, ముబారక్, మల్లేశ్ ఉన్నారు.

వర్షం కోసం పూజలు

కుంటాల: వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ శనివారం మండలంలోని ఓలా గ్రామంలో హనుమాన్ ఆలయంలో గ్రామస్తులు పూజలు నిర్వహించారు. అన్నదానం చేశారు.

వేడుకలు ప్రారంభం

కుంటాల: మండలంలోని ఓలా గ్రామ శ్రీవిఠలేశ్వర స్వామి ఆలయంలో శనివారం తొలి ఏకాదశి వేడుకలు ప్రారంభమయ్యాయి. రుక్మాబాయికి అభిషేకం, అలంకరణ, అర్చన, హారతి నిర్వహించారు.

జెండా గద్దెకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

సోన్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని ఈనెల 7న అన్ని గ్రామాల్లో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాస్ మాదిగ పేర్కొన్నారు. శనివారం సోన్‌లో సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలు లేని నూతన సమాజ నిర్మాణం కాంక్షిస్తూ ఎమ్మార్పీఎస్ తన ఉద్యమ ప్రయాణాన్ని కొనసాగిస్తుందని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండా గద్దెకు భూమిపూజ చేశారు. బుడగ జంగం జిల్లా అధ్యక్షుడు గంగారం, లక్ష్మణ్, కొనగల రాజు మాదిగ, పోశెట్టి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

ముధోల్: ముధోల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలని శనివారం ముధోల్ మాజీ సర్పంచ్ రాజేందర్ హైదరాబాద్‌లోని ఉన్నత విద్యాశాఖ సంయుక్త సంచాలకులు డా.డీఎస్ఆర్ రాజేందర్‌సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. వారి వెంట పలువురు ఉన్నారు.

పాఠశాలల ఏర్పాటుపై హర్షం

నిర్మల్‌రూరల్: జిల్లాలో పాఠశాలల ఏర్పాటుపై ఎస్టీయూ నాయకులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో సంస్కరణలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం అందించామని ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు గజేందర్, జిల్లా అధ్యక్షుడు భూమన్న యాదవ్ పేర్కొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముధోల్ :
జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899